క్లుప్తంగా

పాదచారులకు మజ్జిగ పంపిణీ



మధురానగర్(విజయవాడసెంట్రల్): బీఆర్టీఎస్ రోడ్డులో శుక్రవారం హెల్పింగ్ టు గెదర్ 2009 గ్రూప్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన 2000 మందికి మజ్జిగ పంపిణీ చేశారు. ట్రస్ట్ నిర్వాహకులు మాట్లాడుతూ వేసవిలో పాదచారులు, ప్రయాణికుల దాహార్తి తీర్చడానికి మజ్జిగ పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు షఫీవుల్లా, కోరంగి మల్లీశ్వరి, హేమంతరావు, బీ వసంతకుమార్, జే రవికృష్ణతేజ, సురేష్, మాధవి, ఫణి తదితరులు పాల్గొని మజ్జిగ పంపిణీ చేశారు.

దీవెన ఫౌండేషన్ ఆర్థిక సాయం



భవానీపురం(విజయవాడపశ్చిమ):గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్న ఏడాదిన్నర వయసుగల చిన్నారి ఎలమండ్ల విహశ్రీకి ఒక సారి బైపాస్ సర్జరీ చేశారు. ఈ క్రమంలో ఆ చిన్నారికి రెండవ పర్యాయం కూడా ఆపరేషన్ చేయాల్సి ఉంది. చిట్టినగర్‌కు చెందిన బాధితురాలు చిన్నారికి తండ్రి లేకపోవడంతో తల్లి అనూష కుమార్తె వైద్య ఖర్చుల కోసం దీవెన ఫౌండేషన్‌ను ఆశ్రయించింది. దీంతో ఫౌండేషన్ వ్యవస్థాపక సభ్యులు, హెడ్ కానిస్టేబుల్ నాగరాజు వారి ఇంటికి వెళ్లి రూ.15వేలు ఆర్థిక సహాయాన్ని అందచేశారు. ఆపదలో ఉన్న పేద వారికి సహాయం అందచేసి చేయూత ఇస్తున్న దీవెన ఫౌండేషన్ సభ్యులకు బాధితురాలి తల్లి అనూష కృతజ్ఞతలు తెలియజేసింది. విజయవాడ సిటీ పోలీసు పక్షాన స్థాపించిన దీవెన ఫౌండేషన్ సభ్యులు సహాయ, సహకారాలతో పేదలకు విద్య, వైద్యం ఖర్చుల నిమిత్తం తమ వంతుగా ఆర్థిక సాయం అందచేస్తున్నామని పేర్కొన్నారు. సహకరిస్తున్న గ్రూప్ సభ్యులందరికీ ధన్యవాదాలని హెడ్‌కానిస్టేబుల్ నాగరాజు తెలిపారు.

జగనన్నతోనే సంక్షేమం సాధ్యం



మధురానగర్(విజయవాడసెంట్రల్): అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు గడప వద్దనే అందాలంటే జగనన్నతోనే సాధ్యమని కావున ఫ్యాను గుర్తుకు ఓట్లు వేసి వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలని ఎంపీ కేశినేని నాని సతీమణి కేశినేని పావని, వెలంపల్లి కుటుంబ సభ్యురాలు వెలంపల్లి శ్రీలక్ష్మి కోరారు. స్థానిక 32వ డివిజన్ అయోధ్యనగర్‌లో శుక్రవారం వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌ఛార్జి గుండే సుందర్‌పాల్, మహిళ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పేరం త్రివేణిరెడ్డితో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు గడప గడపకు వెళ్లి జగనన్న ప్రభుత్వంలో చేసిన మంచిని, మేనిఫెస్టోను వివరిస్తూ ఓట్లు అభ్యర్థించారు. అహర్నిశలు మహిళల సంక్షేమం, ఆర్థిక స్వావలంబన కోసం శ్రమించిన జగనన్నకు ఓటు వేసి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గంగానమ్మ పుట్టిన రోజు వేడుక

నున్న(విజయవాడరూరల్): గంగానమ్మ అమ్మవారి తిరునాళ్ల సందర్భంగా మూడవ రోజు గంగానమ్మ విగ్రహ పునఃప్రతిష్ట చేసిన రోజు, అక్షయ తృతీయ పురస్కరించుకొని నున్న గ్రామంలోని శ్రీకాశీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామి దేవస్థానం నుంచి 108 మంది భక్తులు మహిళలు, కన్యలు, జల బిందెలతో అమ్మవారికి అష్టోత్తర శత ఘటాభిషేకం నిర్వహించారు. నున్న గ్రామంలో గంగానమ్మ అమ్మవారిని ప్రతిష్టించిన రోజు భక్తులు పట్టు వస్త్రాలను అమ్మవారికి సమర్పించారు. భక్తులు అధిక సంఖ్యలో వచ్చి అమ్మవారిని దర్శించుకొని మొక్కుబడులు చెల్లించుకున్నారు.

ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయం

- వైఎస్సార్ సీపీ సెంట్రల్ ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు
- పేదల పథకాలను అడ్డుకున్న దుర్మార్గుడు చంద్రబాబు
- వైఎస్సార్ సీపీకి పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధం



30వ డివిజన్ మధ్యకట్ట వద్ద ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న వెలంపల్లి శ్రీనివాసరావు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా సీఎం జగనన్న పారదర్శక పాలన సాగిస్తున్నారని వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక 30వ డివిజన్ బుడమేరు మధ్యకట్టలో శుక్రవారం సాయంత్రం ఆయన కార్పొరేటర్ బీహెచ్ఎస్‌వీ జానారెడ్డితో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మమేకం అవుతూ ఫ్యాను గుర్తుకు ఓట్లు వేయాలని అభ్యర్థించారు. ప్రజారంజక పాలన సాగిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి మరోసారి అవకాశం ఇవ్వాలని కోరారు. ప్రభుత్వం చేసిన మంచిని, అభివృద్ధి, సంక్షేమం చూసి నచ్చితేనే ఓటు వేయాలని అభ్యర్థించారు.

చంద్రబాబుకు గుణపాఠం చెప్పాలి..

అవ్వాతాతలకు పింఛన్, విద్యార్థులకు జగనన్న విద్యా దీవెన, మహిళలకు ఆసరా, చేయూత పథకాలను అందకుండా అడ్డుకున్న చంద్రబాబుకు ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని వెలంపల్లి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. టీడీపీ స్వార్థ ప్రయోజనాల కోసం రెగ్యులర్‌గా అందించే పథకాలను సైతం చంద్రబాబు అడ్డుకోవడం ప్రజల పట్ల ఆయనకు ఉన్న శ్రద్ధ ఏపాటిదో తెలుస్తుందని అన్నారు. పేదల పథకాలను అడ్డుకున్న దుర్మార్గుడు చంద్రబాబు అని విమర్శించారు. చంద్రబాబును సొంత పార్టీ నేతలే నమ్మరని అటువంటిది ప్రజలు ఎలా నమ్మి ఓట్లు వేస్తారని ప్రశ్నించారు. ఎవరు ఎన్ని కుయుక్తులు పన్నినా ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

బొండాకు ఓటు అడిగే అర్హత లేదు..

అధికారంలో ఉండగా ప్రజలను పట్టించుకోని బొండా ఉమాకు ఎన్నికల్లో ఓట్లు అడిగే అర్హత లేదని వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. కోవిడ్ సమయంలో కనీసం ప్రజలు ఎలా ఉన్నారో కూడా పట్టించుకున్న పాపాన పోలేదని అటువంటి బొండా ఇప్పుడు వచ్చి ప్రజలను ఓటు అడగటం ఏదో చేస్తామంటూ మోసపూరిత హామీలు ఇవ్వడం విడ్డూరంగా ఉందన్నారు. ఫ్యాను గుర్తుపై ఓట్లు వేసి ఎంపీ అభ్యర్థి కేశినేని నానిని, తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో వైఎస్సార్ సీపీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



వెలంపల్లితో పెన్షన్ కోసం మా ఓటు జగనన్నకే అంటున్న వృద్ధురాలు



వృద్ధురాలును ఆప్యాయంగా పలకరిస్తున్న వెలంపల్లి

కూటమికి పరాజయం తప్పదు



మాట్లాడుతున్న మల్లాది విష్ణు

మధురానగర్(విజయవాడసెంట్రల్): కూటమికి ఓట్లు వేస్తే సముద్రంలో వేసినట్లేనని.. ఎన్నికల్లో కూటమికి పరాజయం తప్పదని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. మధురానగర్ మెయిన్ రోడ్డులో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. టీడీపీ, బీజేపీ, జనసేన కలయిక అట్టర్‌ఫ్లాప్ అని విమర్శించారు. 2014–19 మధ్య మీ ఐదేళ్ల పాలనలో ప్రజలకు జరిగిన మంచి ఒక్కటైనా ఉందా..? అని ప్రశ్నించారు. దేశ చరిత్రలో మేనిఫెస్టోకు సరికొత్త అర్థానిచ్చి.. ఇచ్చిన వాగ్దానాల్లో 99.40 శాతం నెరవేర్చిన ఏకైక పార్టీ వైఎస్సార్ సీపీ మాత్రమేనని చెప్పుకొచ్చారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత సంపదను సృష్టిస్తూ.. అన్ని రంగాల్లో పురోగతిని సాధించినట్లు తెలిపారు. అది చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు ముప్పేట దాడి చేస్తున్నాయని మండిపడ్డారు. పేదలకు చేస్తున్న మంచిని కూడా తప్పుగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నారని ధ్వజమెత్తారు. ధైర్యముంటే టీడీపీ హయాంలో సాధించిన ప్రగతి, అందించిన సంక్షేమంపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

కూటమికి డిపాజిట్లు కూడా రావు..

2014–19 మధ్య ఇచ్చిన మేనిఫెస్టో ఎక్కడుందో కూడా కూటమి నేతలకు తెలియదని మల్లాది విష్ణు ఎద్దేవా చేశారు. ఈ ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఒంటరిగా ఎదుర్కొనే సత్తా లేక మరలా జట్టు కట్టారని విమర్శించారు. కేవలం డీజీపీని, అధికారులను ట్రాన్స్‌ఫర్ చేయించడం కోసం, సంక్షేమ పథకాలను అడ్డుకునేందుకు కేంద్రంలోని బీజేపీతో జతకట్టారు తప్ప రాష్ట్ర ప్రయోజనాల కోసం ఏమాత్రం కాదని ఆరోపించారు. ప్రత్యేక హోదా ఇస్తామని, విశాఖ ఉక్కును ప్రైవేటీకరించమని, మైనార్టీలకు నాలుగు శాతం రిజర్వేషన్ తొలగించబోమని కేంద్ర పెద్దల చేత ఎందుకు చెప్పించలేకపోతున్నారని ప్రశ్నించారు. కుట్రపూరితమైన కూటమి కలయికను ప్రజలు ఛీత్కరించుకుంటున్నారని చెప్పారు. ఓటమి భయంతో తమ పార్టీలతో పాటు రాష్ట్ర ప్రయోజనాలనూ కేంద్రం వద్ద టీడీపీ, జనసేన తాకట్టు పెడుతున్నాయని ఆరోపించారు. మరోవైపు ఓటర్లను ప్రభావితం చేసేలా ఇప్పటి వరకు ఫోన్ కాల్స్, వాయిస్ మెసేజ్‌లను పంపిన టీడీపీ.. ఇప్పుడు ఏకంగా ఓ చిత్రం విడుదలకే సిద్ధమైందని మల్లాది విష్ణు అన్నారు. దీనిపై తాము ఈసీకి ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. కనుక రానున్న 48 గంటలు టీడీపీ చేస్తున్న దుష్ప్రచారంపై అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించారు. ఈసారి ఎన్నికల్లో కూటమికి డిపాజిట్లు కూడా రావని.. రాష్ట్రానికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి కావడం ఖాయమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కొంగితల లక్ష్మీపతి, ఎస్‌కే బాబు, అక్బర్, కోలా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఆర్ఆర్‌లో జూన్ 28 నుంచి జాతీయ స్థాయి సెమినార్



జాతీయ స్థాయి సెమినార్ బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ పోలా భాస్కర్, ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి తదితరులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జూన్ 28, 29వ తేదీల్లో నిర్వహించనున్న జాతీయ స్థాయి సెమినార్ బ్రోచర్‌ను శుక్రవారం ఉన్నత విద్య కళాశాల కమిషనర్ డాక్టర్ పోలా భాస్కర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో నైపుణ్యాలు వెలికి తీసేందుకు సెమినార్‌లు దోహదపడతాయని అన్నారు. ఇంత మంచి కార్యక్రమం ఏర్పాటు చేసిన నిర్వాహకులను అభినందించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి మాట్లాడుతూ వచ్చే నెల 28, 29 తేదీల్లో 'మేథమెటికల్ మెథడ్స్, మోడల్స్ అండ్ అప్లికేషన్స్ ఇన్ మల్టిడిసిప్లినరీ రీసెర్చ్ అండ్ ఆక్వా కల్చర్ ఫ్రమ్ జెనెస్ టు ఎకోసిస్టమ్' అనే అంశంపై జాతీయ స్థాయి సెమినార్ నిర్వహిస్తున్నామని అన్నారు. ఆ సెమినార్‌లో రీసెర్చి ఆర్టికల్స్ అండ్ అబ్‌స్ట్రాక్ట్స్‌ను ఈనెల 11వ తేదీ నుంచి స్వీకరిస్తామని తెలిపారు. సంబంధిత పత్రాలు యూజీసీ కేర్‌లిస్ట్‌లో ప్రచురింపబడతాయని పేర్కొన్నారు. పోస్టర్, ఓరల్ ప్రజంటేషన్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో కె.సుధాకర్‌రావు, జె.నాగేశ్వరరావు, కె.నాగలక్ష్మి, కె.సుధాకర్, ఎం.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలి

ఏపీ రెడ్డి సంఘం జిల్లా అధ్యక్షుడు నరసింహారెడ్డి

భవానీపురం(విజయవాడపశ్చిమ): వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకునేందుకు రెడ్డి సామాజికవర్గ ప్రజానీకం యావత్తు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా నిలిచి ఎన్టీఆర్ జిల్లాల్లోని వివిధ నియోజకవర్గాల ఎమ్మెల్యే అభ్యర్థులు, విజయవాడ ఎంపీ అభ్యర్థిని గెలిపించుకోవాలని ఆంధ్రప్రదేశ్ రెడ్డి సంఘం ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు బిక్కి నరసింహారెడ్డి, ప్రధాన కార్యదర్శి గజ్జల వెంకటరెడ్డి ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. భవిష్యత్‌లో ఐదేళ్లపాటు ఇప్పుడున్న సంక్షేమ పథకాలు కొనసాగింపునకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి ఓటెయ్యాలని విజ్ఞప్తి చేశారు. పొరపాటున చంద్రబాబు కూటమికి ఓటేస్తే సంక్షేమ పథకాలు ముగింపేనని, ఆలోచించి ఓటు వేయాలని కోరారు. 2014–19లో చంద్రబాబు దరిద్రపు పాలన చూసి ఉంటారని, 2019–24లో సీఎం జగనన్న ప్రభుత్వ పారదర్శక సంక్షేమ పాలన కూడా చూసి ఉంటారని, వాటి మధ్య ఉన్న తేడాను గమనించి ఓటు వేయాలని పేర్కొన్నారు.

సీఎం జగన్ పాలనలో రాష్ట్రం సుభిక్షం

ఎమ్మెల్యే మల్లాది విష్ణు



29వ డివిజన్‌లో ఓట్లు అభ్యర్థిస్తున్న మల్లాది విష్ణు

మధురానగర్(విజయవాడసెంట్రల్): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్ర ప్రజలందరూ సుభిక్షంగా ఉన్నారని.. మారుతున్న పేదల జీవన ప్రమాణాలే ఇందుకు నిదర్శనమని ఏపీ ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. వెలంపల్లి శ్రీనివాసరావు అభ్యర్థిత్వాన్ని బలపరుస్తూ 29వ డివిజన్ మధురానగర్ నేతాజీ రోడ్డు, కొబ్బరితోటలో శుక్రవారం ఆయన విస్తృత ప్రచారం నిర్వహించారు. స్థానిక కార్పొరేటర్ కొంగితల లక్ష్మీపతి, వెలంపల్లి సోదరుడు వెలంపల్లి రాఘవతో కలిసి ప్రతీ గడపకు వెళ్లి వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో జరిగిన మంచిని వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విష్ణు మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం దేశంలోనే శిఖరాగ్రాన నిలిచిందని అన్నారు. తమ ప్రభుత్వం చేపట్టిన నవరత్నాల కార్యక్రమాలు పేదల హృదయాల్లో సుస్థిరంగా, చెరగని ముద్ర వేసుకున్నాయని అన్నారు. కనుకనే కుల, మత, ప్రాంతాలకు అతీతంగా ప్రతిఒక్కరూ జగనన్నే మరలా తమ ముఖ్యమంత్రి కావాలని బలంగా కోరుకుంటున్నట్లు తెలిపారు.

ఐదేళ్లలో అక్షరాల రూ. 33.34 కోట్ల సంక్షేమం..

గత ఐదేళ్లలో డివిజన్‌లో వివిధ ప్రభుత్వ పథకాల ద్వారా అక్షరాల రూ. 33.34 కోట్ల సంక్షేమాన్ని అందజేసినట్లు మల్లాది విష్ణు వెల్లడించారు. వైఎస్సార్ పింఛన్ కానుక ద్వారా ప్రతి నెలా 1,109 మందికి ఇంటి వద్దకే ఠంఛన్‌గా పింఛన్ అందజేస్తున్నట్లు వివరించారు.

టీడీపీ హయాంలో అభివృద్ధి శూన్యం..

మధురానగర్ అభివృద్ధి విషయంలో గత టీడీపీ ప్రభుత్వం బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిందని మల్లాది విష్ణు ఆరోపించారు. గత పాలకుల బాధ్యతారాహిత్యం.. ఈ ప్రాంత ప్రజలను అనేక ఇబ్బందులకు గురిచేసిందన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక డివిజన్ అభివృద్ధికి కోట్ల రూపాయల నిధులు ఖర్చు చేయడంతో పాటు అన్ని రోడ్లను తీర్చిదిద్దామని తెలిపారు. మధురానగర్‌ను మోడల్ డివిజన్‌గా తీసుకుని ప్రాంత ప్రజలకు 24–7 తాగునీరు అందించేలా.. అమృత్ పథకం ద్వారా కొత్త తాగునీటి లైన్లు వేసినట్లు చెప్పారు. రూ. 22 కోట్లతో మధురానగర్ ఆర్‌యూబీని పూర్తిచేసి.. ఈ ప్రాంత ప్రజల కల సాకారం చేసినట్లు తెలిపారు. అలాగే ఇందిరా కాలనీలోని యూజీడీ సమస్యను సైతం పరిష్కరించడం జరిగిందని మల్లాది విష్ణు అన్నారు. కనుక జరుగుతున్న అభివృద్ధి కొనసాగాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరలా ముఖ్యమంత్రి కావాలని పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి.. వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి కేశినేని నాని, ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావును అఖండ మెజార్టీతో గెలిపించవలసిందిగా కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పిల్లి కృష్ణవేణి, కంభం కొండలరావు, అక్బర్, సుధాకర్, నాగమణి, పూర్ణిమ, చీమల గోవింద్, సముద్రపు గోవింద్, కార్యకర్తలు పాల్గొన్నారు.

తీరనున్న చిరకాల కోరిక

- తుది దశకు యూజీడీ పంపింగ్ స్టేషన్ నిర్మాణం
- పూర్తి అయిన పైపులైన్ పనులు



తుది దశకు చేరుకున్న యూజీడీ పంపింగ్ స్టేషన్

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్థానిక 30వ డివిజన్ గద్దె వెంకట్రామయ్యనగర్‌లో యూజీడీ పంపింగ్ స్టేషన్ నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయి. వేగంగా అభివృద్ధి చెందుతున్న గద్దె వెంకట్రామయ్యనగర్, దావు బుచ్చయ్యకాలనీ, వినాయకనగర్ తదితర ప్రాంతాల సౌకర్యార్థం అమృత్ పథకంలో భాగంగా జీవీఆర్‌నగర్‌లో యూజీడీ పంపింగ్ స్టేషన్ నిర్మాణ పనులు చేపట్టారు. అయితే సాంకేతిక కారణాలు, కోవిడ్ తదితర సమస్యలతో పనుల్లో జాప్యం జరిగింది. తర్వాత ఎమ్మెల్యేలు మల్లాది విష్ణు, వెలంపల్లి శ్రీనివాసరావు చొరవతో పనుల్లో వేగం పెరిగింది. ప్రస్తుతం 90శాతానికి పైగా పనులు పూర్తయ్యాయి. ఇప్పటికే యూజీడీ పైపులైన్ పనులను పూర్తి చేశారు. ప్రస్తుతం యూజీడీ పంపింగ్ స్టేషన్‌లో మోటార్లు ఏర్పాటు చేస్తున్నారు. త్వరలోనే ఇక్కడ యూజీడీ పంపింగ్ స్టేషన్ పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువస్తామని అధికారులు చెబుతున్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంటాయి



యూజీడీ పంపింగ్ స్టేషన్ ఎప్పుడు అందుబాటులోకి వస్తుందా అని ఆశగా ఎదురు చూస్తున్నాం. ఇక్కడ మురుగు కాలువలు లేకపోవడం వల్ల దోమలు విజృంభిస్తున్నాయి. ప్రస్తుతం వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పనులు వేగంగా జరుగుతున్నాయి. యూజీడీ అందుబాటులోకి వస్తే పరిసరాలు పరిశుభ్రంగా మారడంతో పాటు దోమల ఉధృతి తగ్గుతుంది.

– బేతాళ శివశంకర్‌రాజు, దావు బుచ్చయ్యకాలనీ

యూజీడీ నిర్మాణం అభినందనీయం



ఇచ్చిన మాట ప్రకారం యూజీడీ పంపింగ్ స్టేషన్ నిర్మాణ పనులు పూర్తిచేయడం ఆనందంగా ఉంది. యూజీడీ వ్యవస్థ అందుబాటులో లేకపోవడం వల్ల ఎక్కడ మురుగు అక్కడే నిలిచిపోవడంతో పాటు దోమలకు ఆవాస కేంద్రంగా మారింది. మా చిరకాల కోరికగా మిగిలిన యూజీడీ పంపింగ్ స్టేషన్ పనులు తుదిదశకు చేరుకోవడం అభినందనీయం.

– దమయంతి, జీవీఆర్‌నగర్

ఫ్యాను గుర్తుకు ఓటు వేసి ఆశీర్వదించండి



నియామక పత్రం అందజేస్తున్న షేక్ నాగుల్ మీరా

పాయకాపురం(విజయవాడరూరల్): ఫ్యాను గుర్తుపై ఓట్లు వేసి వైఎస్సార్ సీపీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆజాద్ ముస్లిం కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగుల్ మీరా అన్నారు. కండ్రికలో శుక్రవారం సెంట్రల్ నియోజకవర్గం ముస్లిం యువకులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నాగుల్ మీరా మాట్లాడుతూ ముస్లింలకు నాలుగు శాతం రిజర్వేషన్లు, రాజకీయపరంగా అనేక మందిని నామినేటెడ్ పోస్టుల్లో నియమించడంతో పాటు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని గెలిపించుకోవాలని అన్నారు. అలాగే ఆజాద్ ముస్లిం కమిటీ చేస్తున్న సేవా కార్యక్రమాలను ప్రజలకు తెలియజేస్తూ కొత్త సభ్యత్వం ప్రోత్సహించాలని సూచించారు. కండ్రిక ప్రాంతానికి చెందిన షేక్ షబ్బీర్ హుస్సేన్‌ను ఆజాద్ ముస్లిం కమిటీ సెంట్రల్ నియోజకవర్గ యూత్ కోశాధికారిగా నియమించి, నియామకపత్రం అందజేశారు. యువత చెడు మార్గాలను వదిలి సేవా మార్గాలను ఎంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు అన్వర్‌బేగ్, సర్వర్ బేగ్, సిలార్ బేగ్ తదితరులు పాల్గొన్నారు.

వన్‌టౌన్‌లో భారీ వర్షం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వన్‌టౌన్‌లో శుక్రవారం భారీ వర్షం కురిసింది. దీంతో వీధులన్నీ వర్షపునీటితో నిండిపోయాయి. ఎండలతో అల్లాడుతున్న ప్రజానీకం వర్షంతో సేదతీరారు. భారీగా కురిసిన వర్షంతో ఒక్కసారిగా వర్షపునీరు రావడంతో కొద్దిసేపు ఆయా ప్రాంతాల్లో మురుగునీరు నిలిచిపోయింది. దీంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.









• బెజవాడలో భారీ వర్షం

బెజవాడలో శుక్రవారం భారీ వర్షం కురిసింది. శుక్రవారం మధ్యాహ్నం ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమైంది. ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. గంటసేపు కుంభవృష్టిగా వర్షం కురవడంతో నగరంలోని పలు ప్రాంతాల్లో జలమయమయ్యాయి. బెంజిసర్కిల్ సమీపంలో రోడ్ల మధ్యలో వర్షపు నీరు చేరింది. నిర్మల కాన్వెంట్ రోడ్డులో రోడ్లు నీట మునిగాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ